క్లుప్తంగా

నేడు నల్లగార్లపాడులో 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడులో సోమవారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గూడ్సు రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

వినుకొండ: గూడ్సు రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వినుకొండ రైల్వే స్టేషను సమీపంలో ఆదివారం ఉదయం జరిగింది. మృతుడిని పట్టణంలోని శృంగారపు వనానికి చెందిన నేలవరపు సతీష్ (30)గా రైల్వే పోలీసులు గుర్తించారు. వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టూ టౌన్ బీజేపీ అధ్యక్షుడిగా ఫణిభూషణ్



నరసరావుపేట: పట్టణానికి చెందిన అడపా ఫణిభూషణ్ టూ టౌన్ బీజేపీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షులు శశికుమార్ ఆదివారం పార్టీ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. పార్టీ అభివృద్ధి కోసం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యులు వల్లెపు కృపారావు, పార్లమెంట్ కన్వీనర్ చిరుమామిళ్ల ఆదినారాయణ, పార్టీ సీనియర్ నాయకులు గుడిపల్లి కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు కామినేని హనుమంతరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు మైలవరపు సుబ్బారావు, యువమోర్చా జిల్లా అధ్యక్షులు రాజనాల వెంకట రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

కూటమి నేతల మాయ మాటలు నమ్మవద్దు

సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్



నరసరావుపేట: నది దాటే వరకు ఓడ మల్లన్న, దాటాక బోడి మల్లన్న సామెత మాదిరి కూటమి పాలన ఉందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ విమర్శించారు. వామపక్షాలు, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల ఐదవ తేదీన మంగళవారం అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లు, సచివాలయాల వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ద్వంద్వ వైఖరిపై మండిపడ్డారు. గృహాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించే ప్రతిపాదన విరమించుకోవాలని వామపక్షాలు, ప్రజా సంఘాలు, ప్రజలు పోరాటాలు చేస్తుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు పెడితే పగలగొట్టండని ప్రతిపక్షంలో ఉండగా నేటి మంత్రి నారా లోకేష్ ప్రజలకు పిలుపునిచ్చారని గుర్తుచేశారు. వీటి వలన ప్రజలకు నష్టం లేకపోతే ప్రతిపక్షంలో ఉండగా ఎందుకు వ్యతిరేకించారని ఆయన ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ ఇంటికి పెట్టడానికి అంగీకరిస్తే పులి బోనులో తలపెట్టినట్లేనని తెలిపారు. గతంలో జరిగిన విద్యుత్ ఉద్యమ ఫలితాన్ని గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాషా, సీఐటీయూ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, కొమ్ముల నాగేశ్వరరావు, జిలాని మాలిక్ పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల రూరల్: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణ శివారులోని కళ్లం టౌన్ షిప్ వద్ద ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. తెనాలికి చెందిన చిక్కా గోపి(55) గత 15 సంవత్సరాల నుంచి కారెంపూడిలో నివాసం ఉంటున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం నిమిత్తం కారంపూడి, పిడుగురాళ్ల వస్తూ ఉండటం కుదరడం లేదని పట్టణంలోని కళ్లం టౌన్ షిప్‌లో ఓ ప్లాట్ తీసుకొని అద్దెకు ఉంటున్నాడు. అయితే ఆదివారం మధ్యాహ్న సమయంలో కళ్లం టౌన్ షిప్ నుంచి అద్దంకి నార్కెట్‌పల్లి హైవే ఎక్కుతుండగా గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఒక కారు చిక్కా గోపిని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని అటువైపు రహదారిలోకి వెళ్లింది. కానీ వెనుక నుంచి వస్తున్న ఇనోవా ఢీకొనటంతో చిక్కా గోపి(55) అక్కడిక్కడే మృతి చెందాడు. పిడుగురాళ్ల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై గుంతలు.. చెత్త స్వాగతం !



ప్రకాష్‌నగర్ ఓవర్ బ్రిడ్జి పక్క అప్రోచ్ రోడ్డుపై గుంతను పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

- 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'లో రోడ్లు, వీధులు పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- రూ.38లక్షలు డ్రా చేసి రోడ్లపై గుంతలు ఎందుకు పూడ్చలేదని ప్రశ్న

నరసరావుపేట: పట్టణంలో రోడ్లపై ఎక్కడ బడితే అక్కడ గుంతలు, చెత్త కన్పిస్తుందని, ప్యాచ్ వర్క్ పేరుతో మున్సిపాల్టీ నుంచి డ్రా చేసిన రూ.38లక్షలను ఏమి చేశారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలో 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట' కార్యక్రమంలో భాగంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ద్విచక్ర వాహనాల పైన, నడిచి పర్యటించారు. చిత్రాలయ థియేటర్ పక్క రోడ్డు, ప్రకాష్‌నగర్, బాబాపేట, వినుకొండ రోడ్ల తీరు, ఏర్పడిన పెద్ద గుంతలను పరిశీలించారు. డ్రెయిన్లలో మురుగునీరు పారక పొంగి పొర్లటం, చెత్త కుప్పలు కుప్పలుగా పడి ఉండటాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రోడ్లపై పడిన పెద్ద గుంతల్లో పడి వాహనదారులు తీవ్రంగా గాయపడుతున్నారని తెలిపారు. మరమ్మతులకు మున్సిపాలిటీ నుంచి రూ.38 లక్షల డ్రా చేసినా, ఎక్కడా ప్యాచ్ వర్క్ చేసిన దాఖలాలు కనపడటం లేదని, ఈ డబ్బంతా ఏమైందో అర్థం కావట్లేదని తెలిపారు. వినుకొండ రోడ్డులో ఎక్కడా చెత్త తీయట్లేదని పేర్కొన్నారు. రోడ్ల పక్కన ఫుట్ పాత్‌ల నిర్మాణం చేయకపోవటంతో తిరిగి ఆక్రమణలు పెరిగిపోతున్నాయని తెలిపారు. 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట' కార్యక్రమం వార్డుల వారీగా నిర్వహిస్తామని, పారిశుద్ధ్యం మెరుగుపడేంతవరకు అధికారులు, ప్రభుత్వానికి నిద్ర లేకుండా చేస్తామని హెచ్చరించారు.

అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు మోసం

సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ పథకంతో రైతుల్ని మోసం చేశారని గోపిరెడ్డి విమర్శించారు. తమ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 53 లక్షల మంది రైతులకు సహాయం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం కేవలం 46 లక్షల మందికి మాత్రమే డబ్బులు ఇచ్చి, ఏడు లక్షల మందికి ఎగ్గొట్టిందని తెలిపారు. గత ప్రభుత్వం ప్రతి రైతుకు రూ.13,500 చొప్పున ఐదేళ్లకు రూ.67,500 ఇచ్చిందని పేర్కొన్నారు. మొత్తం రూ.38వేల కోట్లు ఇస్తే, కూటమి ప్రభుత్వం కేవలం రూ.2,400 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. గతేదాది అసలు ఇవ్వకుండా ఎగ్గొట్టారన్నారు. గ్రామాల్లో రైతులు ప్రస్తుతం పంటలకు పెట్టుబడి పెట్టే పరిస్థితుల్లో లేరని, ఎక్కడా అప్పు కూడా పుట్టటం లేదన్నారు. పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ఆరు ఇన్‌స్టాల్‌మెంట్లు ప్రభుత్వం కట్టలేదని చెప్పారు. కళాశాల యజమానులు వాటిని నిర్వహించలేక డబ్బులు కట్టమని విద్యార్థులని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాస్టారు, మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్, పట్టణ అధ్యక్షులు షేక్ కరీముల్లా, వర్కింగ్ ప్రెసిడెంట్ అచ్చి శివకోటి, నేతలు నిడమానూరి సురేంద్ర, అన్నం శివా చౌదరి, మూరే రవీంద్రరెడ్డి, కనకా పుల్లారెడ్డి, కుక్కల పౌలు, తలారి బాలరాజు, హాలీవుడ్ రఘు, ఎస్‌కే ఆంజనేయులు, షేక్ శిలార్ బాషా, గంటెనపాటి గాబ్రియేలు, బాదుగున్నల శ్రీనివాసరావు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధం

బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర దుర్గంధంతో పారిశుద్ధ్య పరిస్థితి అధ్వానంగా ఉందని తెలిపారు. నూతన టాయిలెట్లు నిర్మించినా, నిర్వహణ సక్రమంగా లేదన్నారు. వాటర్ సప్లై ఇవ్వలేదని, డ్రైనేజీ మొత్తం బ్లాక్ అయ్యి చెడు నీరు రోడ్డు మీదకు వచ్చి దుర్గంధం వస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్సులు ఏ రూట్లోనూ సరిగా లేవని చెబుతున్నారని, ఈ పరిస్థితుల్లో ఉచిత బస్సు పథకం ఆగస్టు 15 నుంచి ఎలా అమలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లకు బస్సులే సరిపోక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఉచిత బస్సు కార్యక్రమం పెట్టి జనాల్ని ఇబ్బంది పెడుతూ వారిని మోసం చేయడమేనని గోపిరెడ్డి తెలిపారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

- మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజం
- అక్రమ కేసులపై భయపడే ప్రసక్తి లేదు
- వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు అండ
- ఇష్టానుసారంగా బెల్ట్‌షాపుల ఏర్పాటు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వం
- అర్హులకు పింఛన్లు మంజూరు కాకుండా అడ్డు పడుతున్న టీడీపీ నేతలు

శావల్యాపురం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే, పీఏసీ సభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు ధ్వజమెత్తారు. శావల్యాపురంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ విస్తృతస్థాయి సమావేశాన్ని ఆదివారం మండల కన్వీనర్ బోడేపూడి వెంకటేశ్వర్లు (కొండలు) అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ పరిపాలన గాలికి వదిలేసి, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని ఖండించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అండగా ఉంటామని, కేసులకు భయపడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. అర్హత గల వైఎస్సార్ సీపీ సానుభూతిపరుల పింఛన్లు తొలిగిస్తే సహించమని, ఉద్యమాలు చేస్తామని తెలిపారు.

అధికార పార్టీ నాయకుల పైశాచిక ఆనందం

వినుకొండ పట్టణంలో గాంధీ విగ్రహాన్ని కూల్చివేత చర్యలకు చేపట్టి అధికార పార్టీ నాయకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని బ్రహ్మనాయుడు మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే రాజధాని పేరుతో కాసులు, కమీషన్లు కోసం కూటమి నేతలు కక్కుర్తి పడుతున్నారని ఎద్దేవా చేశారు. బడి గుడి అనేది తేడా లేకుండా గ్రామాల్లో బెల్ట్ షాపులు ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారని తెలిపారు. అధికార పార్టీ ఆగడాలకు అంతులేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన, సంక్షేమ పథకాలు గురించి ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై దాడికి పాల్పడటం, ఎదురు కేసులు పెట్టి భయానిక వాతావరణాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. ఇలాంటి దుర్మార్గమైన పాలన గతంలో ఎన్నుడూ చూడలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. గత వైస్సార్ సీపీ పాలనలో ప్రజలంతా సుఖశాంతులతో విలసిల్లితే, ఈనాటి బాబు పాలనలో మోసాలు కుట్రలతో అక్రమ కేసులతో ప్రజలు అల్లాడిపోతున్నారని విమర్శించారు. లిక్కర్ అక్రమ కేసులో చెవిరెడ్డి భాస్కరరెడ్డిని అనేక ఇబ్బందులకు గురిచేస్తూ, తప్పుడు కేసులతో ఫొటోలను మార్పింగ్ చేసి ఎల్లో మీడియా ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. రూ.11 కోట్లు దొరికాయని అంటున్నారని, బ్యాంకు డిపాజిట్ చేసిన స్లిప్‌లు కూడా చూపించలేకపోయారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఒక్కరిని రెడ్ బుక్ రాజ్యాంగం ద్వారా అనేక ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు.

ప్రజల్లో చైతన్యం కలిగించాలి

సంక్షేమ పథకాల గురించి సామాన్య ప్రజల స్వేచ్ఛను హరిస్తున్నారని బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. పాలన సరిగా లేకపోయినా ప్రచార ఆర్భాటాలు, ఫ్లెక్సీలతో అధికార పార్టీ నేతలు కాలయాపన చేస్తుండటంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ అవినీతి, తప్పుడు కేసులు గురించి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లో చైతన్యం కల్గించాలని ఆయన పిలుపునిచ్చారుఉ. రాబోయే రోజుల్లో చంద్రబాబు దుర్మార్గ పాలనకు అంతం చేయటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు చేసిన అభివృద్ధి ఏమిటని బొల్లా ప్రశ్నించారు. గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలు కట్టనీయకుండా పోలీసుల అండతో అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. పరిపాలన సంగతి ఏమోగానీ జగన్ నామస్మరణంతో టీడీపీ నాయకులు భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. వినుకొండ ప్రాంతంలో వంద పడకల వైద్యశాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులు తెచ్చామన్నారు. స్థలాన్ని గుర్తించి ఏర్పాటు చేస్తే నేటి వరకు పనులు ప్రారంభించక పోవడం ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు.

ధైర్యంగా ఎదుర్కోవాలి

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు భయపడకుండా ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలను ధైర్యంగా ఎదుర్కోవాలని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. వెఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి శిలఫలకాలు పగలకొట్టడం అధికార పార్టీ దుర్మార్గపాలనకు నిదర్శమని పేర్కొన్నారు. తమ పాలనలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాల మంజూరు చేశామని బ్రహ్మనాయుడు వివరించారు. కార్యక్రమంలో జుజ్జూరి బరామమూర్తి,ఎంపీటీసీ సభ్యులు దేవనబోయిన పోతురాజు, దారా మోషే, దూదెకుల హుస్సేన్, న్యాయవాది ఎం.ఎస్. ప్రసాద్, తిరివీధి రమణారావు, బొల్లా సుబ్బారావు, షైదా, భీమని అంకారావు, పొట్టిపాటి శ్రీనివాసరావు,అమ్మిరెడ్డి అంజిరెడ్డి, బొల్లా రమేష్, బీర్పెడి రత్నగిరి, పురేటి రామాంజినేయులు, ఎరుకల రెడ్డి ముంద్రు ప్రభు, సురేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జుజ్జూరి బరామమూర్తి, న్యాయవాది ఎం.ఎస్. ప్రసాద్, తిరివీధి రమణారావు, బొల్లా సుబ్బారావు, షైదా, భీమని అంకారావు, పొట్టిపాటి శ్రీనివాసరావు, అమ్మిరెడ్డి అంజిరెడ్డి, బొల్లా రమేష్, బీర్పెడి రత్నగిరి, పురేటి రామాంజినేయులు, ఎరుకల రెడ్డి ముంద్రు ప్రభు, సురేష్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి !



సంఘీభావం తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

అఖిల పక్ష ప్రజా సంఘాలు, నాయకుల పిలుపు

చిలకలూరిపేట: విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా వ్యతిరేకించాలని అఖిల పక్ష ప్రజా సంఘాలు, పార్టీల నాయకులు పిలుపు నిచ్చారు. పట్టణంలోని పండరీపురంలో గల ప్రజా సంఘాల కార్యాలయంలో పట్టణ విద్యుత్ వినియోగదారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్ట సవరణలతో రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాలు తగ్గి, అదాని వంటి ప్రైవేటు వ్యక్తులకు నియంత్రణ పెరిగిందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారంలో లేనప్పుడు మరోలా మాట్లాడటం పరిపాటిగా మారిందని విమర్శించారు. గతంలో స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరిన ఆయన అధికారంలో వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూ అప్, సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలని కోరారు. విద్యుత్ చార్జీల పెంపు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఈ నెల ఐదున పట్టణంలోని విద్యుత్ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయనాయక్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎం. రాధాకృష్ణ, ప్రజా సంఘాల నాయకులు బి. శ్రీను నాయక్, షేక్ అల్లాబక్షు, పేరుబోయిన వెంకటేశ్వర్లు, వంజా ముత్తయ్య, సాతులూరి బాబు, టి. భారతి,టి. ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం



చిలకలూరిపేట: నియోజకవర్గ పరిధిలోని కొమరవల్లిపాడు, గణపవరం వ్యవసాయ సహకార పరపతి సంఘాల నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. కొమరవల్లిపాడు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా చిలకలూరిపేట మండలం కావూరు గ్రామానికి చెందిన కోడె హనుమంతరావు, డైరెక్టర్లుగా గొట్టిపాటి బాబు(గొట్టిపాడు), మునీర్ హసన్(పురుషోత్తమపట్నం) బాధ్యతలు స్వీకరించారు. గణపవరం వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన పెంటేల శేషయ్య, డైరెక్టర్లుగా పూర్ణే హనుమంతరావు(ఇర్లపాడు), యామిని ధర్మారావు(అప్పాపురం) ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ సీఈవో చింతల అజయ్‌కుమార్, కొమరవల్లిపాడు సొసైటీ అధికారులు బి. అశోక్‌కుమార్, పి. లక్ష్మయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'ప్లాన్' లేని టౌన్ ప్లానింగ్

- ప్రజలకు శాపంలా మారిన అధికారుల పనితీరు
- అడ్డదిడ్డంగా డ్రైనేజీల నిర్మాణం
- మధ్యలో అడ్డుగా విద్యుత్ స్తంభం



నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీలు

వినుకొండ: స్థానిక మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు పట్టణ ప్రజలకు శాపంలా మారింది. పట్టణంలోని కొన్ని ప్రాంతాలల్లో డ్రైనేజీల నిర్మాణం అడ్డదిడ్డంగా సాగుతోంది. ఒక ప్లాను లేకుండా నిర్మిస్తుండటంపై షాపుల యజమానులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు బయటకు పోకుండా నిర్మించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అరుణ సినిమా హాలు నుంచి శివయ్య స్తూపం వరకు డ్రైనేజీ నిర్మాణం అస్తవ్యస్తంగా ఉంది. ప్రకాష్ హోటల్ దగ్గర మధ్యలో ఎలక్ట్రికల్ స్తంభం అడ్డుగా ఉండటంతో మురుగు నీరు పోయే అవకాశం లేకుండా ఉంది. రోడ్డు కంటే డౌన్‌లో డ్రైనేజీని నిర్మిస్తున్నారు. వర్షం పడినప్పుడు రోడ్డుపై పారే మురుగ నీరు డ్రైనేజీలోకి వచ్చే అవకాశం ఉంది. నెలల తరబడి మురుగు నీరు షాపుల ముందు రోడ్డుపై నిలుస్తుందని వ్యాపారులు వాపోతున్నారు.

స్తంభం తొలగించడానికి భారీ ఖర్చు

అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగించడానికి 10 స్తంభాలు మార్చాలి. దీనికి గానూ రూ. 20 లక్షల వరకు విద్యుత్ శాఖకు చెల్లించాల్సి వస్తోంది. డబ్బులు చెల్లిస్తేనే మారుస్తామని విద్యుత్ అధికారులు తేల్చి చెప్పడంతో చేసేదేమీ లేక మధ్యలోనే వదలివేసి నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. దీనివల్ల మురుగు నీరు షాపుల ముందే నిలుస్తుందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలు ఒక క్రమపద్ధతిలో లేవని, వెడల్పుల్లో తేడాలు ఉన్నాయని అంటున్నారు. ఒకచోట వెడల్పుగా మరోచోట సన్నగా నిర్మించడమేమిటని ప్రశ్నిస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



కాల్వ మధ్యలో అడ్డుగా ఉన్న స్తంభం

అధికారుల తీరు బాగో లేదు



గతంలో మున్సిపల్ సమావేశాలల్లో డ్రైనేజీ నిర్మాణాలపై ప్రశ్నించినప్పటికీ అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదు. మురుగు నీరు పోకుండా డ్రైనేజీ నిర్మాణాల వల్ల ఉపయోగం ఏమిటి? మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారు తీరు బాగో లేదు. విద్యుత్ స్తంభం అడ్డు వస్తుందని తెలియదా ? అధికారుల కంటే తాపీ మేస్త్రీలే నయం. చక్కగా నిర్మిస్తారు.

– బేతం గాబ్రియేలు, మున్సిపల్ వైస్ చైర్మన్, వినుకొండ

సక్రమంగా లేని అధికారుల పనితీరు



మున్సిపల్ అధికారుల పనితీరు సక్రమంగా లేదు. డ్రైనేజీలు ప్రజల సౌకర్యం కోసం కట్టినట్లు లేదు. కేవలం కాంట్రాక్టరు, కొందరి ప్రయోజనాల కోసమే కడుతున్నట్లు ఉంది. విద్యుత్ స్తంభం అడ్డు వస్తుందని అధికారులకు తెలియదా? పనితీరు మార్చుకుని సమస్యను పరిష్కరించాలి. లేనిపక్షంలో న్యాయ పోరాటానికి వెనుకాడం.

– సింగంశెట్టి ప్రసాద్, స్థానికుడు

గుర్రం జాషువా లా చాంబర్స్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయం ప్రారంభిస్తున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

వినుకొండ: పట్టణంలోని రైల్వేస్టేషను రోడ్డులో ఆదివారం గుర్రం జాషువా లా చాంబర్స్ నూతన కార్యాలయాన్ని మాజీ మంత్రి, న్యాయవాది డొక్కా మాణిక్యవరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాషువా పేరుతో నూతనంగా కార్యాలయం ప్రారంభించేందుకు కృషి చేసిన న్యాయవాదులు అప్పరాజు అపర్ణాదేవి, పరిశపోగు రాహుల్ అంబేడ్కర్, కాకాని నాగేశ్వరరావు, జాషువాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వినుకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మీసాల శ్రీనివాసరావు, పొట్లూరి సైదారావు, సీహెచ్ఎల్ ఎన్ మూర్తి, కావూరి గోపీనాథ్, చాగంటి వీరాంజనేయ చౌదరి, దుగ్గపోగు విజయ్, ధూపాటి విజయ్, ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావు, విశ్రాంత డీఐజీ స్టాంప్స్ బాలస్వామి, జెడ్పీ కో-ఆప్షన్ మెంబర్ గుండాల స్వెనోం, సంద్రపాటి సైదా, మారుతీ వరప్రసాద్, న్యాయవాది రెడ్డి నాగ పద్మ పాల్గొన్నారు.

కేంద్రియ విద్యాలయంలో సందడిగా క్యాంప్ ఫైర్



క్యాంప్ ఫైర్‌లో స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు పీఎం శ్రీ కేంద్రియ విద్యాలయంలో ఈనెల ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు తెలంగాణ భారత స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రితీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్ -2025 ఆదివారం మూడో రోజుకు చేరింది. ప్రిన్సిపల్ నీరజ్ శ్రీ వాస్తవ కార్యక్రమ నిర్వహణ పర్యవేక్షించారు. బుద్ధి కల్పనతో కార్యక్రమం ప్రారంభమైంది. యోగా, వ్యాయాయంతో స్కౌట్స్, గైడ్స్ శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకున్నారు. ఆదివారం యూనిఫాం పరిశీలన, జాతీయ పతాక ఆవిష్కరణతో క్రమశిక్షణ, దేశభక్తి భావాలను ప్రతిబింబించారు. సోపాన్ నైపుణ్య ప్రాత్యక్ష పరీక్షలు నిర్వహించారు. అనంతరం 'దేశ భక్తి -జాతీయ చిహ్నాలు' అంశంపై ప్రత్యేక సెషన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. సామాజిక సేవ కార్యక్రమం 'శ్రమదానం'లో విద్యార్థులు చురుకుగా పాల్గొని, సమాజ సేవపై నిబద్ధతను చాటారు. రాత్రి గ్రాండ్ క్యాంప్ ఫైర్ ఆకట్టుకుంది. ప్రత్యేక అతిథిగా పల్నాడు జిల్లా అదనపు ఎస్పీజేవీ సంతోష్ హాజరై, స్కౌట్స్‌కు ప్రోత్సాహకర సందేశం అందించారు. కార్యక్రమంలో ఎస్. విజయకుమార్, రవీందర్, రామ్‌కోటి, మృత్యు సమద్దర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

సందడిగా కళాశాల గోల్డెన్ జూబ్లీ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: కొత్త రఘురామయ్య జూనియర్ కళాశాల (1975- 2025) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం కళాశాలలో గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కళాశాలలో వివిధ హోదాలలో పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ అనుభవాలను పంచుకున్నారు. తొలి తరం అధ్యాపకులు గరికపాటి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ఆజాద్, రామయ్య, అబ్బూరి లక్ష్మీనారాయణ తదితరులు అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ పాలడుగు శ్రీనివాస ప్రసాదు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మేజర్ జి.వెంకటేశ్వరరావు, పిజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కౌషిక్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన రణ అంకమ్మ తల్లి కొలుపులు



నరసరావుపేట రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో రణ అంకమ్మ తల్లి కొలుపులు ఘనంగా ముగిశాయి. గుమ్మడిదల ఇలవేల్పుగా పూజలందుకున్న రణ అంకమ్మ తల్లి కొలుపులను గత 30వ తేదీ నుంచి ఆలయంలో నిర్వహిస్తున్నారు. ఆదివారం కొలుపుల ముగింపులో వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు దొండేటి అప్పిరెడ్డి, నల్లగంగుల యజ్ఞారెడ్డి, గ్రామస్తులు గుమ్మడిదల శివ, బీరం భాస్కరరెడ్డి, కొల్ల వెంకటనారాయణ, కుందా యాకోబు, చంటి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.